



కాలేజీనుంచి వచ్చి వరండాలోకి కుర్చీలాక్కుని కూర్చున్నాను. రోజల్లా కుర్రాళ్ళ బుర్రల్లోకి విజ్ఞానం ఎక్కించేందుకు వ్యర్థ ప్రయత్నం చేసిన నాకు ఈ చల్లని గాలి మనస్సుకి ఎంతో హాయినిస్తోంది.

ఎదురుగా నున్న పచ్చమేడలోంచి 'సిలోన్' అరవ సంగీతం హోరెత్తి పోతోంది. ఇండ్లలో ఏవేళప్పుడు విందామన్నా సిలోన్ తప్ప ఇంకొకటి వినబడదు కదా!.... వాళ్ళ ఇంటిని చూసినప్పుడల్లా నాకుఎంతో ఈర్ష్యగా ఉంటుంది. ఎప్పుడూ చాలా సరదాగా ఉన్నట్టు కనుపిస్తుంది ఆ ఇంటి వాతావరణం. ట్యూబులైట్లు, రేడియో, గుమ్మాలకి, కిటికీలకి తెరగుడ్డలు—అయన ఏదో కంపెనీలో మానేజరట. అదృష్టవంతుడు! నాప్రాణానికి వాళ్లఇళ్లు ''ఆనంద నిలయం''!

''మాష్టారూ!''

ఉలిక్కిపడి పక్కకి చూచాను. ఒక చిన్న కుర్రాడు—షుమారు ఎనిమిదేళ్ళు ఉంటాయి—బిక్కుబిక్కుమంటూ నిలబడి ఉన్నాడు. అవతారం మట్టుకు మంచి బట్టలతో అందంగా ఉన్నాడు.

''మాష్టారూ! మానాన్నగారు మిమ్మల్నొకసారి రమ్మంటున్నారండి!'' అని గబగబా అనేసి తన పనయి అయిపోయినట్టు వెనక్కితిరిగాడు.

నాకు నవ్వొచ్చింది. అసలు ఆ అబ్బాయి ఎవరో తెలియదు నాకు—ఇంక వాళ్ల నాన్న సంగతి చెప్పనవసరంలేదు. 'అయన'—నన్ను'' రమ్మన్నాడట.!

''ఇదిగో చూడు బాబూ, మీ ఇల్లెక్కడ?'' అనడిగాను సాధ్యమయినంత మృదువుగా.

''ఆ మేడ!'' అని వేలుపెట్టి పచ్చమేడవంక చూపించాడు. వాడి కండ్లలో ఎంతో ఉత్సాహం కనిపించింది నాకు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఆ మేడ ఆయనకి నాతో ఏం పనిచెప్మా? కొంపదీసి నేనిలా కూర్చోవడం వాళ్ళఇంట్లో వాళ్ళకిఅభ్యంతరంగాఉందేమో? నాన్సెన్స్! అది నాయిష్టం అనుకుంటూ అబ్బాయి వంక తిరిగాను.

వెళ్ళిపోయాడు!

వెళ్ళటమా, మానటమా అన్న మీమాంసలో ఒక అరగంట గడిపేశాను. చివరికి వెళ్లేముందు నిశ్చయించుకుని లేచి నిలబడ్డాను.

'కూర్చోవోయ్, కూర్చో! నేనిలాకుర్చీలోకూర్చుంటానులే! అంటూ ఒకాయన హడావుడిగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

బహుశ ఎదిరింటి ఆయన అయి ఉంటాడనుకుని—

''మీరు శ్రమ తీసుకున్నారు. నేనూఇప్పుడే ఒయలుదేరబోతున్నాను.'' అన్నాను సాధ్యమైనంతసిగ్గు పడి.

ఆయన గలగల నవ్వేసి ''వో, వో''ఫరవాలేదు. లేవోయ్—మావాడు వచ్చాడో లేదోనని నేనే వచ్చేశాను. —వాడికీ బోలెడు సిగ్గు'' అంటూ రిమ్‌లెస్‌కండ్లజోడులోంచి గది కలయజూసి ''అద్దె ఎంత?'' అనడిగాడు.

చెప్పాను... ఆయన వచ్చిన పనేమిటో మట్టుకు నాకు అంతు పట్టటంలేదు. మనిషిలో ఆఫీసరు హుందా వుంది!

''నేనెందుకుకొచ్చానాఅని ఆశ్చర్యపడుతున్నారు కదూ—మరేంలేదు మా అమ్మాయి ఉంది—ప్రీయూనివర్సిటీ చదువుతోంది''...నాప్రాణం ఎగిరిపోయింది!

''....అది ఫిజిక్సులో కొంచెం నట్టుగా వుంది. చెబుదామనుకుంటే మనకి సైన్సుకి చుక్కెదురు. కామర్సు వాడిని నేను... కాబట్టి మీరు శ్రమ అనుకోకుండా దానికి ప్రయివేటు చెప్పాలి.!''

''అమ్మయ్య'' అనుకున్నాను గాని మళ్ళీ ఈ కొత్త అవతారం భయపెట్టింది. నేనింత వరకు ఎవరికీ ప్రయివేట్లు చెప్పటంలేదు.—ఇక ముందు కూడా చెప్పకూడదనే అనుకున్నాను.కాని పెద్దమనిషి ఇంటికి వచ్చి అడుగుతుంటే ఎలా కాదనడం?

''నాకింతవరకు ప్రయివేట్లు చెప్పాలనే అభిప్రాయం లేదండి.ఆ నేర్పు, ఓపికా రెండూలేవు. అందువలన మీరు నన్ను క్షమించాలి'' అనేశాను ధైర్యం చేసి.

''వో,వో అలాగంటే వీల్లేదు. మీరు పాఠాలు చాలా బాగా చెబుతారనీ మీ ప్రిన్సిపాల్ చెప్పాడు. అయినా, నేనూ మొన్న కార్న్స్ ఆడుతుంటే మీపేరు రికమెండ్ చేశాడు. తనే మీకు స్వయముగా చెబుతానన్నాడుకూడా!''అన్నాడు నవ్వుతూ.

ఇంకే మనను.—నన్ను ఆకాశంలోకి ఎత్తేస్తుంటే!

రేపటినుంచి మాయింటికి రండి. వయసొచ్చిన పిల్లని బయటికి పంపుతే బావుండదు. మనమెలాగున్నాలోకానికి వెరవాలి! ఏమంటారు?'' ఏకపకనవ్వాడు.

ఆయున్ని కాదనగల ధైర్యం నాకెక్కడిదీ—నేనూ నవ్వేశాను!

''మరికవస్తాను. ఫీజు సంగతి సందేహించకండి'' అంటూ వెళ్ళిపోయాడు.

''సుడిగాలిలాంటి మనిషి— వ్యాపారానికి సరిపోయినవారు'' అని నవ్వుకున్నాను.

మర్నాడు సాయంత్రం హోటల్లో భోజనం ముగించుకుని వాళ్ల యింటికి వెళ్లాను.

నాకోసమే ఎదురు చూస్తున్నట్టున్నాడు. నన్ను చూడంగానే ''రండి! రండి! ఇవ్వాళ రారేమోనని భయపడుతున్నాను.'' అని నవ్వుతూ ఆహ్వానించాడు.

ఇద్దరం కలిసిలోపలికి వెళ్లాం ''అమ్మాయి వాసంతీ, ఇటు రామ్మా! మాష్టారు వచ్చారు''అని కేకేశాడు.

లోపలికి గుమ్మం తెరవెనుక కాసేపు కదిలి బయటికి వచ్చింది!

కాలేజీలో చదివేరోజుల్లో సహాధ్యాయునులని తరువాత ఉద్యోగంలో చేరాక విద్యార్థినులని—చూడగా చూడగా నాకు ఒకగట్టి నమ్మకం ఏర్పడిపోయింది. — అందమయిన అమ్మాయిలంతా స్కూల్ తోనేపెండ్లిడ్లయి చదువులుమానేస్తారని వివాహపు మార్కెట్టులో చెల్లుబడి కానిసరుకంతా కాలేజీల్లోకి వస్తారని!

కాని ఆ దృఢాభిప్రాయాన్ని వసంతిని చూశాక వెంటనే మార్చుకో వలసివచ్చింది. ....శాపవశాన దివినుంచి భువికి జారిన అప్సరసలా, శరత్కాలపు కదిలే తెలిమబ్బు తునకలా—కదిలివస్తున్న ఆమె అందానికి ముగ్ధుడినయి పోయాను.

''నమస్కారమండి!'' నాజూగ్గా రెండు చేతులూ జోడించింది. ప్రతి నమస్కారంచేసి కుర్చీలో కూర్చున్నాను.

''చూడమ్మా, వీరిని నీకు ఫిజిక్సు చెప్పేందుకు ఒప్పించేసరికి గగనమయింది. కాబట్టి వారి దగ్గర జాగ్రత్తగా నీ అనుమానాలు అవి అడిగి చెప్పించుకో—పాసవ్వాలి....ఇకనే వస్తానండి క్లబ్ కి ఆలస్యమయిపోయింది'' అని హడావుడిగా వెళ్ళిపోయాడు.

నాకేమీ పాలుపోలేదు.

''రండి మాష్టారూ లోపలికి'' అంటూ రేడియో గదిలోకి దారితీసింది. తనపుస్తకాలన్నీ నాముందు పడేసి తను బుద్ధిమంతురాలిలాగా గడ్డంకింద చేయిపెట్టుకుని కూర్చుంది—నాకెదురుగా.

కాసేపు పుస్తకాలు తిరగేశాను. మొదటి రోజున పాఠం చెబితె ఆ అమ్మాయి హడలిపోతుందని—ఫిజిక్సు చరిత్ర చెప్పాను.భూమి గుండ్రంగా ఉందని అన్నందుకు గెలీలియోని పిచ్చివాడిని జమకట్టడం,భూమికి ఆకర్షణశక్తి ఉందని ఆపిల్ పండు పాడటంచూసి న్యూటన్ సిద్ధాంతీకరించడం ఎడిసన్ ఎలక్ట్రిసిటీని కనుక్కోవడం—రేడియం కోసం క్యూరి దంపతులు పడినకష్టాలు చివరికి టెలివిజన్, అణుశక్తి వలని లాభనష్టాలు—వీటి రాలా మీద అనర్గళంగా ఒక గంటన్నర ఉపన్యాసం దంచేశాను.

కథలు చెప్పినంత సరదాగా ఉన్నట్లుంది—జాగ్రత్తగా, ఓపిగ్గా వింది. ముఖకవళికలని బట్టి నచ్చిందని గ్రహించి 'ధన్యుడ్ని' అనుకున్నాను.

''రేపు పెందళకాడే రండి మాష్టారు!''అంది నేవచ్చేసేముందు.

''వీలుండాలేగాని రోజల్లా ఇక్కడే ఉండనా!'' అనుకుంటూ గాలిలో ఎగిరిపోయి రూమ్ కి వెళ్లాను.

రోజూ కథలు చెబితె ఎలా? మర్నాడు పాఠం మొదలు పెట్టాను. కాసేపు నేను ఏమనుకుంటానోనని విని చివరికి ''మాష్టారూ, ఈరోజు మంగళవారం కదండీ—కల్పలత శ్రోతలు కోరిన పాటలు విందాం'' అని సమాధానంకోసం చూడకుండా మొదట హైదరాబాదు, తరువాత విజయవాడ పెట్టింది.

తొమ్మిది గంటలదాకా పాటలు వింటూ రూముకి చేరాను.

ఆ మర్నాడు కనీసం పుస్తకాలయినా నాముందు పడేయలేదు! ''ఏవి వసంతా—పుస్తకాలెక్కడ?'' అనడిగాను.

నావంక చిలిపిగాచూచి''అయితేమాష్టారూ—రూ! మీకు హిందీ పాటలంటే ఇష్టంలేదా?'' అడిగింది విస్తుపోతూ.

నాకు అవమానంవేసి ''లేదేం—లేదు ఇష్టం'' అన్నాను.

''అయితేరండి బినాకాగీత్ మాలా విందాం'' అని రేడియో ఆన్ చేసింది. ఇద్దరం రేడియోలో తలలుదూర్చి—తరువాత ఏం పాట వస్తుందో పందాలు కాసుకుంటూ గడిపేశాం.

నాకు ఆ అమ్మాయిఎదుట గడిపిన ఘడియలు మధురమయినవనిపించి రూముకి వెళ్లాక గా ఢాంధకారంగా కనుపించేది! ఎప్పుడు మళ్లీసాయంత్రం ఏనిమిది అవుతుందా అని ఎదురు చూసే వాడిని.

ఈ విధంగా ఒక పదిరోజులు గడిచాయి. కాని ఒక్కరోజున ఆ అమ్మాయికి పాఠం చెపిన పాపాన పోలేదు. చెప్పించుకుంటేగా! ఒకరోజు వారపత్రికలమీదవిమర్శ, ఒకరోజు సినిమాల మీద, శనివారంనాడు వాళ్ళఇంట్లో చేసిన ఫలహారాలు తినడం — ఈరకంగా మధురంగా గడిచిపోయాయి రోజులు.

ఆయన అడుగుతె ఏమని చెప్పాలా అని ఆలోచించే వాడిని. కాని ఆయనసలు నా విషయమే మర్చిపోయినట్టున్నాడు!

రోజులు గడిచినకొద్దీ వసంతని — మర్చిపో


## మీ పెట్టుబడివల్ల ఎక్కువ ఆర్జన వచ్చేట్టు చూడండి

ఇన్ వెస్టర్సు

ఏజన్సీ

డిపార్టుమెంటు

- 35 ఏం. ల పరకు సాలుకు రు. 1000 పెట్టుబడి పెట్టండి.
- అది పెరిగి ఒక లక్ష రూపాయలకంటె ఎక్కువగా లాభం తెస్తుంది.
- మీరు రు. 250/- లతో కూడ ప్రారంభించవచ్చు.
- వివరములకు మా 139 బ్రాంచీలలో దేనిలోనైనా విచారించండి.

## సిండికేట్ బ్యాంకు

కెనరా ఇండస్ట్రియల్ అండ్ బ్యాంకింగ్ సిండికేట్ లిమిటెడ్

తే పరిస్థితిలోకి పోయాను. అమాయకంగా నవ్వే ఆమె నవ్వు నా హృదయ తంత్రుల్ని మీటినట్లుండేది! ఆ ఘంటకాలం కలలాగా కరిగి పోయేది.

మామూలు ప్రకారం ఒక రోజు పుస్తకం పుచ్చుకోబోతుంటే "మాస్టారూ, ఇవ్వాళ 'ఎవరింగ్' మొదలండి" అంది హఠాత్తుగా.

"అప్పుడు ఇవాళనుంచే — ఏం, ఈపూట పాఠం ఎగ్గొట్టి వెళ్లాలని ఉందా?" అనడిగాను నవ్వుతూ.

"వెడదాం వస్తారా?"

హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకి ఉలిక్కిపడి "రెండో ఆటకా?" అనడిగాను ఆశ్చర్యంగా.

"ఏం, తప్పా?" అంది అమాయకంగా.

ఆమె అమాయకత్వానికి నాకు నవ్వొచ్చింది. "ఇవాళ ఒద్దులే — రేపు ఆదివారమేగా మ్యాటినీకి వెడదాం" అని ఒప్పించాను.

ఆటో రిక్షాలో సినిమాకి వెళ్లాం. ప్రక్క ప్రక్క సీట్లలో కూర్చున్నాం. ఆమె సామీప్యం నన్ను కలవరపెట్టింది. ఆమెతో పరిచయమైన రోజున కలిగి బలపడుతున్న వుద్రేకాన్ని ఈరోజు ఎలాగయినా బయట పెట్టెయ్యాలని నిశ్చయించుకున్నాను. అందుకు ఇంతకన్న మంచి అవకాశం రాదు.

సినిమాలోని సన్నివేశాలకి నన్ను పట్టుకుని వూపి "చూడండి మాస్టారూ, ఎంత బావుందో ఈపాట వినండి రోజూ మా రేడియోలో వస్తోంది" అంటూ నన్ను మాటిమాటికీ కొట్టి మరీ చెబుతోంది. నేను మట్టుకు ఈలోకంలో లేను.

ఆమె పసిహృదయానికి నవ్వుకుని ఆమె చెయ్యి కుర్చీమీదనుంచి భుజం మీదికి చేర్చి వేశాను. తెలుసో తెలియదో కాని మొత్తంమీద మామూలుగానే ఉంది.

సినిమా వదిలాక కాఫీతాగి ఇద్దరం అలా పార్కుకి బయలుదేరాం. మనిషిలో కొంచెం మార్పు కనబడింది నాకు. మాటిమాటికీ సిగ్గు పడుతోంది. ఆమెకు దగ్గరగా నడుస్తూ ఒకటి రెండు సార్లు ఎదురుగా వచ్చేవారిని తప్పించేందుకన్నట్టు చుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కున్నాను. మాట్లాడలేదు. కనీసం అయిష్టతను ప్రదర్శించలేదు. ఆమెలోని ఈ సుముఖత నాకు ఎక్కడలేని బలాన్ని, హుషారుని కలిగించింది.

ఎవరూలేని ఏకాంత ప్రదేశంలో కూర్చున్నాక "వాసంతీ, నిన్ను చాలా రోజులనుంచి ఒకటి అడుగుదామనుకుంటున్నాను. కాని ఎలా ప్రారంభించాలో తెలియక ఆగిపోయాను ఇన్నిరోజులు. నీకు కోపం వస్తుందేమోనని భయం—"అని కాసేపాగి ఆమెవంక చూశాను.

నేను చెప్పబోయేది పసికట్టింది కాబోలు— సిగ్గుతో తలవంచుకుని గడ్డిపరకలు పీకుతోంది.

"నిన్ను నాదానిగా చేసుకోవాలనుకుంటున్నాను వాసంతీ, నీకభ్యంతరం లేకపోతే మీనాన్నగారిని అడుగుతాను" ఆపేశాను ఖంగారుగా, హడావుడిగా.

మరీ సిగ్గుపడిపోయి తల ఇంకా వంచేసుకుంది. బుగ్గలు ఎర్రబడ్డాయి!

"ఏం వాసంతీ ఏమంటావు?"

"మీ ఇష్టం!" అంది మెల్లిగా.

"అదృష్టవంతుడ్ని" అంటూ వాసంతిని దగ్గరకు తీసుకున్నాను.

ఆమర్నాడు నేనూ వాసంతీ కూర్చుని ఉన్నప్పుడు హఠాత్తుగా వాళ్ళనాన్న వచ్చాడు. అదే సమయమనుకొని ఆయనకి నానిశ్చయం చెప్పాను. "మా అమ్మాయే మీకు కట్నం" అన్నాడు నవ్వుతూ.

కట్నంలేకుండా పెళ్లేమిటని మావాళ్ళు, మొదట అభ్యంతరపెట్టినా నా పట్టుదల మూలంగా విధిలేక ఒప్పుకున్నారు ..

వాసంతిని నాదాన్ని చేసుకుని స్వర్గంలోవిహరిస్తున్నాను.

ఒకరోజు దోమలబాధ వల్లనో, గాలి లేక పోవడం వలననో హఠాత్తుగా మెలకువ వచ్చింది.

వరండాలోంచి మా మావగారి మాటలు వినబడుతున్నాయి మెల్లిగా.

"చూశావా సావిత్రీ — నేనంటే ఎందుకూ పనికిరాని వాడినని, సంసార విషయాలు పట్టించుకోనని కదూ నీఉద్దేశం. కాని నా అంత ముందు చూపుకలవాడు "కాలుక్యులేటివ్ బ్రెయిన్" అసలు లేరు తెలుసా?" గర్వంగా అన్నాడు.

"ఎందువల్లనో?" మెత్తగా అంటోంది అత్తగారు.

"వాసంతికి దమ్మిడీకట్నం లేకుండా బంగారం లాంటి అల్లుణ్ణి సంపాయించాను ... ఉద్యోగస్తుడు, అందమయినవాడు, బోలెడు ఆస్తిపరుడు అని వాళ్ళ ప్రిన్సిపాల్ అనగానే ఒక ప్లాను వేశాను. ప్రయివేటు చెప్పమన్న మిషమీద మన వాసంతిని అతనికి పరిచయం చేశాను. అదే మొదలు దాని అందానికి దిమ్మెరపోయాడు. ఇటువంటిది భార్య అయితేనే చాలుననుకున్నాడు. వాళ్ళని ప్రేమించుకోనిచ్చాను. ఒకరోజు అతను అమ్మాయిని దగ్గరగా తీసుకున్న సమయంలో గదిలోకి వెళ్ళాను. కలవరపడిపోయి "మావగారూ మీవాసంతాన్ని పెండ్లాడే అదృష్టం కలిగించండి" అన్నాడు. "ఆల్‌రైట్" అన్నాను. దాంతోటి వీళ్ళవాళ్ళని ఒప్పించి మరీ చేసుకున్నాడు." పకపకనవ్వి "మామూలుగా అయితే పదివేలకి తగ్గేవాళ్ళు కాదు తెలుసా?" అన్నాడు.

"ఎంత గడుసువారండీ — అందుకే నన్ను గదిలోకి వెళ్లొద్దనేవారు" విస్తుపోయిందావిడ.

నేనూ ఆశ్చర్యపోయాను.

"అయితే వాసంతికి కూడా మీప్లాను తెలుసా?" అడిగిందావిడ.

"అబ్బే, దానికి తెలియదు. అందరికీ ఇటువంటి విషయాలు చెప్పేస్తే ఇంకా నా గొప్ప ఏముంది?

వాసంతి వైపు చూశాను. కిటికీలోంచి మీద పడుతుంటే వెన్నెల లోపలనుంచి బయటికి పోతోందా అన్న భ్రమ కలిగింది. నా ఈ అప్సరస మర్మమెరుగనిది — నాక్కావలసింది అదే!

"అసలు అందమైనకూతుళ్లున్న దండ్రులు కొంచెంముందు చూపుకి తెలివితేటలు జోడిస్తే నీలాగానే దమ్మిడీ ఖర్చుచేయకుండా పెళ్లి చేయవచ్చు." అంటున్నాడాయన.

ఆయన నిసలైన వ్యాపారి.

★

